క్లుప్తంగా

ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు


హోటల్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

కోరుట్ల/కోరుట్ల టౌన్: ప్లాస్టిక్ వాడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ అన్నారు. పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, చికెన్ సెంటర్లు, ఆర్డర్ మెస్‌ల్లో మంగళవారం మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అపరిశుభ్రత, నిల్వ ఉంచిన ఆహారం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తున్న యజమానులకు రూ.12 వేలు జరిమానా విధించారు. పరిశుభ్రత పాటిస్తూ తడి,పొడి చెత్త వేరు చేసి, మున్సిపల్ వాహనాలకు అందజేయాలని, బట్ట సంచులే వాడాలని మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ సూచించారు. తనిఖీల్లో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలె అశోక్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ జి.మహేశ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాల నివారణ


మాట్లాడుతున్న ఎస్సై అనిల్

ఇబ్రహీంపట్నం: ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ఎస్సై అనిల్ అన్నారు. మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు సెఫ్టీ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించవద్దని,ఆటోలు, జీబుల్లో పరిమితికి మించి ప్రయాణిస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని వివరించారు. మైనర్లు వాహనాలు నడుపవద్దని, ఒక వేళ నడిపితే వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. హెల్మెట్ ధరించాలని కోరారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు, టీవీలకు దూరంగా ఉండి శ్రద్ధతో చదివితే భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ పాలసీ ఏర్పాటుకు చొరవ తీసుకోవాలి


ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని కలిసిన అశోక్

మల్లాపూర్: గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఎన్ఆర్ఐ పాలసీ ఏర్పాటు చేయాలని ఇండియన్ పీపుల్స్ ఫోరం(ఐపీఎఫ్) సీనియర్ నాయకులు పెనుకుల అశోక్ కోరారు. మంగళవారం దుబాయిలో ఇండియన్ పీపుల్స్ ఫోరం ఆధ్వర్యంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని ఆయన కలిసి వినతిపత్రం అందించారు.దీనికి స్పందించిన ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి గల్ఫ్ కార్మికుల గోడును కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, అసెంబ్లీలో ఈ అంశాన్ని లేవనెత్తుతానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ పీపుల్స్ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

డీఈవోకు సన్మానం

జగిత్యాల: జిల్లా కేంద్రంలో ఎసెస్సీ పరీక్షల మూల్యాంకనం విజయవంతంగా పూర్తి చేసినందుకు టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు డీఈవో రామును మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో పదో తరగతి పరీక్షల మూల్యాంకనం పూర్తిచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బోగ రమేశ్, ఎడ్ల గోవర్ధన్, రాజయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా అగ్ని మాపక వారోత్సవాలు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఫైర్ సిబ్బంది

ధర్మపురి: అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా ధర్మపురి పట్టణంలో మంగళవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫైర్ అధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో, ఇతర దుకాణదారులకు అగ్ని ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్ల కేటాయింపు ఎప్పుడో?

- సాంకేతిక సమస్యలతో లబ్ధిదారుల ఎదురుచూపులు
- 2బీహెచ్‌కే కాలనీలో సమస్యల తిష్ట
- శిథిలావస్థకు చేరుతున్న కేటాయించని ఇళ్లు


పిచ్చిమొక్కలతో నిండి శిథిలావస్థకు చేరుతున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు

బుగ్గారం: పేదలకు పక్కా ఇళ్లు కట్టించడమే ధ్యేయంగా గత ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన డబుల్ బెడ్ రూం పథకంలో భాగంగా బుగ్గారం మండలం చిన్నాపూర్‌లో మాజీ మంత్రి ఈశ్వర్ చొరవతో గ్రామశివారులో 39 డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించారు. వీటిలో ఇప్పటికే 23 ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించగా వారంతా అక్కడే ఉంటున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికీ కొన్ని ఇళ్లు ఎవ్వరికీ కేటాయించకుండా అలాగే వదిలేయడంతో ఆ ఇళ్లు శిథిలావస్థకు చేరుతున్నాయి.

మిగిలిన ఇళ్లు కేటాయించేదెన్నడు?

మొత్తం 39 ఇండ్లలో లబ్ధిదారులకు కేటాయించగా, మిగిలిన 16 ఇళ్లు ఇంకా ఎవరికీ కేటాయించలేదు. దీంతో ఆ ఇళ్లల్లో పిచ్చిమొక్కలు పెరిగి పాడుబడిపోతున్నాయి. అలాగే పొలాల మధ్యన ప్రాంతం కావడంతో పాములు నివాసం ఏర్పచుకుంటున్నాయి. దీంతో వాటి పక్కనే ఇళ్లు పొంది ఉంటున్న లబ్ధిదారులు భయం భయంగా గడుపుతున్నారు. ఈ పాడుబడిన ఇళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయనే ఆరోపణలున్నాయి.

నీటి సమస్య..

చిన్నాపూర్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన 2బీహెచ్‌కే ఇళ్లు ఎత్తైన ప్రాంతంలో ఉండడంతో నీటి సరఫరా ఇబ్బందిగా మారింది. స్థానికుల అవసరాల కోసం వేసిన రెండు బోరింగుల్లో ఒక్కటీ పనిచేయడం లేదు. మిషన్ భగీరథ ద్వారా వచ్చే నల్లా నీరు తమకు సరిపోవడం లేదని స్థానికులు అంటున్నారు. దీంతో తామంతా స్థానిక వ్యవసాయ బావుల నుంచి నీటిని తెచ్చుకుని వాడుకుంటున్నామని వాపోతున్నారు. అలాగే మురుగుకాల్వలను సమయానుసారం శుభ్రం చేయకపోవడంతో నీరు నిల్వ ఉండి కంపు కొడుతుందని ఆరోపిస్తున్నారు. కాలనీలో స్థానికుల అవసరాల కోసం ఖాళీగా ఉంచిన స్థలంలో ఇసుక, కంకర పోయడంతో అసౌకర్యంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ఎమ్మెల్యే, విప్ స్పందించి కాలనీలో సమస్యలు పరిష్కరించాలని, మిగిలిన ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని ప్రజలు కోరుతున్నారు.


కాలనీ మధ్యలో పోసిన కంకర

నీటి కోసం తిప్పలు పడుతున్నాం



మా కాలనీలో నీటి సమస్య అధికంగా ఉంది.నల్లాల ద్వారా వచ్చే నీరు మా అవసరాలకు సరిపోవడం లేదు.అలాగే కాలనీలో వేసిన బోర్లు ఉపయోగంలో లేవు.ఒక బోరుబావి మోటారు లోపలే ఇరుక్కుపోయింది.అధికారులు స్పందించి మా సమస్యలు తీర్చాలి.

–మూల లక్ష్మి,చిన్నాపూర్, 2బీహెచ్‌కే కాలనీ

త్వరలో కేటాయిస్తాం



చిన్నాపూర్ 2బీహెచ్‌కే కాలనీలో మిగిలిన 16 ఇళ్లను ఉన్నతాధికారుల ఆదేశాలతో త్వరలోనే అర్హులకు కేటాయిస్తాం.కొంతమంది లబ్ధిదారుల రేషన్‌కార్డులకు సంబంధించి సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఇళ్లను కేటాయించడం ఆలస్యమవుతోంది. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తాం.

– మాజిద్, తహసీల్దార్,బుగ్గారం



కోరుట్ల రూరల్: మండలంలోని సంగెంలో డ్రైయినేజీ నీళ్లు రోడ్డు పైనే పారుతున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ శివారులోని చిన్న వాగు వద్ద ఇంకుడు గుంతలోకి డ్రైయినేజీ నీళ్లు వెళ్లేవి. కాగా ఇంకుడు గుంత వద్ద డ్రైయినేజీ మూసుకు పోవటంతో నీళ్లు రోడ్డుపై ప్రవహిస్తూ బురదమయమైంది. దీంతో సంఘ మహేశ్వర ఆలయానికి కాలి నడకన వెళ్లే భక్తులతో పాటు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: కృపాకర్
మండల పంచాయతీ అధికారి, కోరుట్ల : 9676949987

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు ధర


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కోరుట్ల రూరల్/ఇబ్రహీంపట్నం: రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మంగళవారం కోరుట్ల రూరల్ మండలంలోని మోహన్‌రావుపేట, చిన్నమెట్‌పల్లి గ్రామాలు, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్ముకొని మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలోసింగిల్‌విండో చైర్మన్లు బండి భూమయ్య, బద్దం గోపి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకట్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి సురేందర్, మాజీ వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, నాయకులు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

కోరుట్ల/కోరుట్ల రూరల్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, సీనియర్ నాయకుడు ,చీటి వెంకట్రావు,బీఆర్ఎస్‌వి మండల అధ్యక్షుడు నత్తి రాజ్ కుమార్.నాయకులుపాల్గొన్నారు.

రజతోత్సవ సభకు భారీగా తరలి రావాలి

కోరుట్ల: ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలి రావాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలోని బీడీ కార్మికులు, పలు కుల సంఘ నాయకులను మంగళవారం కలిసి రజతోత్సవ సభ ఆహ్వాన పత్రికలు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి సారిగా బీడీ కార్మికలకు జీవన భృతి అందించాన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు మాజీ అధ్యక్షుడు చీటి వెంకట్రావు, నాయకులు గడ్డం మధు,రాజ్ కుమార్, సందయ్య,పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్దతు ధరకే ధాన్యం విక్రయించాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

జగిత్యాలరూరల్: రైతులు ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని, దళారులను నమ్మి మోసపోవద్దని డీఆర్డీఏ పీడీ రఘువరన్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్, వెల్దుర్తి, వంజరిపల్లి, జాబితాపూర్, ధర్మారం గ్రామాల్లో ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 132 ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ప్రస్తుతం ఏర్పాటు చేశాయని, అన్ని కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి, ఏపీఎం గంగాధర్, సీసీ మరియ, నాయకులు మహేశ్, మల్లారెడ్డి, శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: రైతులు ప్రభుత్వ మద్దతు ధరకే ధాన్యం విక్రయించాలని సింగిల్ విండో చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల, బాలపల్లి, పొలాస, ధర్మారం, నర్సింగాపూర్, లింగంపేట గ్రామాల్లో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శీలం సురేందర్, డైరెక్టర్లు, సీఈవో వేణు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్, బొమ్మెన, తాండ్ర్యాల, తుర్తి గ్రామాల్లో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ చైర్మన్ నారాయణరెడ్డి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ దాసరి గంగాధర్, వైస్ చైర్మన్ శీలం మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

మల్యాల: వరి కోతలు ప్రారంభమై ఇరవై రోజులు గడుస్తున్నాయని, వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని బీజేపీ మండలాధ్యక్షుడు గాజుల మల్లేశం అన్నారు. మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు పేరుకుపోతున్నాయని, తక్షణమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.

రాజ్యాంగాన్ని బీజేపీ అవమానిస్తోంది


చిన్నమెట్‌పల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

కోరుట్ల రూరల్/ఇబ్రహీంపట్నం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని బీజేపీ కించ పరుస్తుందని కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ఆరోపించారు. మంగళవారం కోరుట్ల మండలంలోని చిన్నమెట్‌పల్లి,ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తిలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా బీజేపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని అణగదొక్కాలని చూస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, కొంతం రాజం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతం విలువలు పెంచే భాష

కథలాపూర్: సంస్కృతం కేవలం మార్కుల భాష కాదు.. విలువలు పెంచే భాష అని సంస్కృతం లెక్చరర్ల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యుడు యాగండ్ల రాజశేఖర్ అన్నారు. మంగళవారం కథలాపూర్‌లో మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ద్వితీయ భాషగా సంస్కృతం ఉండటం వలన ఎవరికి నష్టం కలగదన్నారు. ఇంటర్ బోర్డు సంస్కృతంను ద్వితీయ భాషగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశపెట్టడం కోసం జీవో జారీ చేయడం మంచి పరిణామమన్నారు. సంస్కృతం నేర్చుకోవడం ద్వారా విద్యార్థులకు భగవద్గీత, రామాయణం, భాగవతం, ధర్మ నీతి విలువలు తెలుసుకునే వీలుంటుందన్నారు.

పీడీని కలిసిన సెర్ప్ యూనియన్ కార్యవర్గ సభ్యులు

జగిత్యాలరూరల్: ఐకేపీ సెర్ప్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం జగిత్యాల గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి రఘువరన, ఏపీడీ చరణ్‌దాస్‌లను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లాలో ఐకేపీ, సెర్ప్ కార్యక్రమాలు, మహిళాశక్తి కార్యక్రమాలు ప్రగతి పథంలో అమలు చేయిస్తూ మహిళా సంఘాల అభివృద్ధికి పాటుపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కోల చక్రవర్తి, ఉపాధ్యక్షుడు ఆనం శంకర్, ప్రధాన కార్యదర్శి పోతు నరహరి, గౌరవ అధ్యక్షుడు గంగాధర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భూభారతిలో అప్పీల్ వ్యవస్థ హర్షణీయం

జగిత్యాల: భూ వివాదాలు లేని తెలంగాణ లక్ష్యంగా భూభారతిలో అప్పీల్ వ్యవస్థ తీసుకురావడం హర్షణీయమని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. తహసీల్దార్లు జారీ చేసే పాస్‌బుక్‌ల్లో భూదార్‌పై ప్రజలకు అభ్యంతరాలుంటే ఆర్డీవోకు అప్పీల్ చేసుకునేందుకు సెక్షన్ 12 నిబంధన 14 ద్వారా అవకాశం కల్పించిందని, ఆర్డీవో ఇచ్చిన తీర్పుపై అభ్యంతరాలుంటే కలెక్టర్‌కు అప్పీలు చేసుకోవచ్చన్నారు. ముటేషన్లు, సాదాబైనాలపై అభ్యంతరాలున్నా అప్పీలు చేసుకోవచ్చన్నారు. కలెక్టర్ ఇచ్చిన తీర్పుపై అభ్యంతరాలుంటే ట్రిబ్యునల్‌కు అప్పీలు చేసుకోవచ్చని, ఈ అవకాశాలు ధరణి లో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. కార్యక్రమంలో విశ్వనాథం, ప్రకాశ్ పాల్గొన్నారు.

నేడు పెగడపల్లిలో విప్ అడ్లూరి పర్యటన

పెగడపల్లి: మండలంలో బుధవారం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పర్యటిస్తారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర రాములుగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని రాజరాంపల్లి, పెగడపల్లి, రామ్‌నగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, మండల పరిషత్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్, కల్యాణ చెక్కులు పంపిణీ చేస్తారని తెలిపారు. మండల కాంగ్రెస్ శ్రేణులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఆట స్థలాలే ధాన్యం కొనుగోలు కేంద్రాలు


నామాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం

పెగడపల్లి: మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు స్థలాలు కరువయ్యాయి. యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభ మవుతున్నాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో గత ప్రభుత్వం తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. ప్రస్తుతం మండలంలోని పలు గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాల స్థలాలు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఉపయోగిస్తున్నారు. దీంతో కొన్ని గ్రామాల క్రీడాకారులు, యువకులు క్రీడలు ఆడుకునేందుకు క్రీడా ప్రాంగణాలు లేకుండా పోయాయని వాపోతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలపై సర్వే


సర్వేకు ఎంపికైన చింతకుంట జెడ్పీ హైస్కూల్

కథలాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, వాటి పరిస్థితులు ఎలా ఉన్నాయనే అంశంపై విద్యాశాఖ అధికారులు సర్వేకు శ్రీకారం చుట్టారు.దీని కోసం కథలాపూర్ మండలంలో 20 పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో కరీంనగర్ డైట్ కళాశాల నుంచి స్టూడెంట్ టీచర్స్ వచ్చి సర్వే చేపడుతారని ఎంఈవో శ్రీనివాస్ మంగళవారం తెలిపారు.

హెచ్ఎంలు ఇచ్చిన నివేదిక ప్రకారమే సర్వే..

పాఠశాలల వారీగా హెచ్ఎంలు యూడైస్ ప్లస్‌లో వివరాలు నమోదు చేశారు. వాటి ఆధారంగానే పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించడం, ఇతర అవసరాల కోసం నిధులు ప్రభుత్వం కేటాయిస్తుంది. పాఠశాలల్లో విద్యాబోధన, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ఖాళీలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు, ఉచిత పుస్తకాలు, క్లాస్ రూంల పరిస్థితి, క్రీడా మైదానాలు, ల్యాబ్‌లు, మరుగుదొడ్లు, తాగునీరు వసతిపై సర్వే చేపడుతారని అధికారులు పేర్కొన్నారు. ఒక్కో స్టూడెంట్ టీచర్స్‌కి 10 పాఠశాలలను సర్వే చేయాలని లక్ష్యం విధించారు. ఇలా కథలాపూర్ మండలానికి ఇద్దరికి కేటాయించారు. ఈ నెల 16 నుంచి సర్వే ప్రారంభించి 21లోగా పూర్తి చేయనున్నారు.

పోషకాహారంతో ఎదుగుదల


మాట్లాడుతున్న సీడీపీవో వీరలక్ష్మి


దావన్‌పల్లిలో మాట్లాడుతున్న సీడీపీవో

రాయికల్/మల్యాల: బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పోషకాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవోలు మమత, వీరలక్ష్మి అన్నారు. మంగళవారం రాయికల్ మండలం దావన్‌పల్లిలో, మల్యాల మండలం బల్వంతాపూర్‌లో పోషణ్‌పక్వాడా కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పోషకాహార పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్య సమాజ నిర్మాణం కోసం అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సువర్ణ, కార్యదర్శి గీత రాణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సారంగాపూర్: మండలంలోని పెంబట్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణ పక్వాడాలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత, తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ, ఇద్దరికి గాయాలు

మల్యాల: మండలంలోని ముత్యంపేట శివారులో దిగువ కొండగట్టులో రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. దిగువ కొండగట్టులోని జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై బైక్ యూటర్న్ తీసుకుంటుండగా, జగిత్యాల నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న మరో బైక్ ఢీకొంది. ప్రమాదంలో కొడిమ్యాల మండలం రాంసాగర్‌కు చెందిన గాజుల చైతన్య(20) భువనగిరి జిల్లా మోత్కూరుకు చెందిన కాంతం గణేశ్(18) గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది ఈఎంటీ జ్యోతి, పైలట్ ఆంజనేయులు క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి, జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు శ్రమించాలి


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మెట్‌పల్లి: విద్యార్థులు లక్ష్య సాధన కోసం శ్రమించాలని పలువురు సూచించారు. పట్టణంలోని మనోహర్ గార్డెన్‌లో మంగళవారం స్థానిక జ్ఞానోదయ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు.విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైద్యులు జాకబ్ కిరణ్, కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సంతోష్, ఉపన్యాసకులు పాల్గొన్నారు.